ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





ఇరుక్కుపోయింది..!

భీమవరం బైపాస్ రోడ్‌లో రైల్వేగేటు వద్ద ఒక లారీ ఇరుక్కుపోయింది. దీంతో సుమారు గంటసేపు ట్రాఫిక్ జామ్ అయింది. ఉండి రోడ్డు నుంచి జనరేటర్‌తో ఒక లారీ పాలకొల్లు వెళుతోంది. గేటు వద్దకు వచ్చేసరికి గేట్ ఇనుప రాడ్ పట్టేసింది. అటూ ఇటూ వాహనాలు నిలిచిపోయాయి. రైల్వే అధికారులు వెంటనపపే అక్కడకు చేరుకుని రైల్వే గేటు బోల్ట్ ఊడదీసి లారీని పంపించారు. దీంతో ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయిన వారంతా ఊపిరి పీల్చుకున్నారు.

-భీమవరం క్రైం

ప్రభుత్వ ఆధీనంలో మాధవాయిపాలెం రేవు

ఇకపై ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకే పంటు రాకపోకలు



నరసాపురం రూరల్, జూలై 2: మాధవాయిపాలెం-సఖినేటిపల్లి రేవును బుధవారం నుంచి మండల పరిషత్ ఆధీనంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం అధికారులు సమావేశమై రేవు నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకు గోదావరిలో పంటు రాకపోకలు సాగనున్నాయి. రాత్రి 7 దాటిన తరువాత రేవుల్లో పడవల్ని కూడా అనుమతించమని ఎంపీడీవో రమణరావు చెప్పారు. టిక్కెట్ ధరలు ప్రస్తుతం ఏ విధంగా ఉన్నాయో అవే కొనసాగుతాయన్నారు. ఈ ఏడాది ఎన్నికల కోడ్ కారణంగా 2024-25 ఆర్థిక సంవత్సరం పాటను నిర్వహించలేదు. ఏప్రిల్ 1 నుంచి జూలై 2 మంగళవారం వరకు పాత పాటదారుడే రోజుకు రూ 1.05 లక్షలు చెల్లించే విధంగా ఒప్పందం చేసుకుని రేవును నిర్వహిస్తూ వచ్చారు. అయితే నిర్వహణదారుడు సుమారు రూ.40 లక్షలపైనే బకాయి పడ్డారు. ఇప్పటి వరకు ఎన్ని నోటీసులు ఇచ్చినా స్పందన లేదు. దీంతో శనివారం జాయింట్ యాక్షన్ కమిటీ అత్యవసర సమావేశమైంది. 2 తేదీ రాత్రి వరకు నిర్వహణదారుడు సొమ్ము చెల్లించని పక్షంలో రేవును స్వాధీనం చేసుకోవాలని తీర్మానించారు. మంగళవారం సాయంత్రం వరకు నిర్వహణదారుడు నుంచి ఎటువంటి సమాచారం లేదు. దీంతో బుధవారం నుంచే ప్రభుత్వ సిబ్బందిని నియమించి రేవు నిర్వహణ చేపట్టాలని నిర్ణయించినట్లు ఎంపీడీవో తెలిపారు.

తీరంలో ఇసుక దొంగలు



మొగల్తూరు వద్ద ఇసుక తవ్వుతున్న దృశ్యం (ఫైల్)

- వైసీపీ హయాంలో విచ్చలవిడిగా దందా
- సముద్ర తీరంలోనే తవ్వకాలు
- ఇతర జిల్లాలకు ఎగుమతులు
- రోజూ కోట్లలో వ్యాపారం
- నేతలు, ఆధికారుల కనుసన్నల్లో చీకటి వ్యాపారం
- ప్రభుత్వం మారినా..నేటికి అదే తంతు

నరసాపురం, జూలై 2 : నరసాపురం తీరంలో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. ప్రభుత్వం మారినా ఇసుక దందా ఆగలేదు. రూపాయి పెట్టుబడి లేకుండా సముద్ర తీరాల్లోని ఇసుకను ఇతర ప్రాంతాలకు ఎగుమతులు చేసి లక్షలు దండుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో నేతలు, కొందరి అధికారుల కనుసన్నల్లో ఈ చీకటి దందా సాగింది. నేడు ఈ మాఫియాలో చాలామంది అధికార పార్టీకిలోకి ఫిరాయించి మళ్లీ దోచేస్తున్నారు. ఈదందా రెండు రకాలుగా సాగుతోంది. మొదటిది సముద్ర ఇసుక అయితే రెండవది సరుగుడుతోట, జీడిమామిడి తోటల్లో పేరుకుపోయిన ఇసుక మేటలు. వీటిల్లో సముద్ర నుంచి ఇసుక తవ్వేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి ఇవ్వదు. ఇక రెండో రకం తవ్వి తరలించాలంటే రెవెన్యూ, మైన్స్ అధికారుల అనుమతి ఉండాలి.కానీ ఇక్కడ ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలించేస్తున్నారు. దీనివల్ల సముద్రం ముందుకు చొచ్చుకొస్తున్నది.

కోట్లు కురిపిస్తున్న సముద్ర ఇసుక

నరసాపురం తీరప్రాంతంలో 19 కిలోమీటర్ల మేరక సముద్రం తీరం విస్తరించింది. ఆటుపోట్లకు సుమారు కిలోమీటర్ మేర ఇసుక మేటలు కనిపిస్తుంటాయి. కొన్ని చోట్ల గుంటలు గుంటలుగా ఉంటాయి. గతంలో ఈ ఇసుకలో ఎక్కువ ఉప్పుశాతం ఉండటం వల్ల ఎందుకూ పనికొచ్చేది కాదు. ఈ కారణంగా ఈ ఇసుక వైపు ఎవరూ కన్నెత్తి చూసేవారు కాదు.అయితే నాలుగేళ్ల నుంచి ఈ ఇసుక కాసులు కురిపిస్తున్నది. జాతీయ రహదార్లు, రైల్వే పూడిక పనులకు ఈ ఇసుకను ఎక్కువుగా ఉపయో గిస్తున్నారు. మట్టి ఖరీదు కావడంతో వ్యాపారుల చూపు కూడా ఈ ఇసుకపైనే పడింది. ఇదే మాఫియాకు కాసులు కురిపించింది. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో గతంలో అతి కొద్ది మంది మాత్రమే ఈ దందా చేసేవారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో నేతల అండదండలతో ఈ సంఖ్య 150 వరకు పెరిగింది. యంత్రాల సాయంతో ఇసుక గుట్టల్ని తవ్వేస్తున్నారు. వాటిని ట్రాక్టర్లు, లారీల్లో నింపి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. గతంలో ట్రాక్టర్ ఇసుక రూ.800, లారీ ఇసుక దూరాన్ని బట్టి రూ.4 వేల నుంచి రూ.5 వేలు ఉండేది. ఇది నేడు రూ.10 వేలకు చేరింది. ఇందులో ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా ఆదాయం ఉండదు. అయితే ఆధికారులకు, పార్టీ నేతలకు మాత్రం నెల నెలా లక్షలు ముడుతున్నాయి. చీకటి పడిందంటే ఇసుక లారీలు దూర ప్రాంతాలకు దూసుకుపోతున్నాయి. సరిహద్దునున్న కృష్ణా, తూర్పు జిల్లాలకు కూడా ఇక్కడ నుంచే ఇసుక తరలిపోతుంది. నిబంధనల ప్రకారం సముద్రానికి 500 మీటర్ల లోపు ఎటువంటి తవ్వకాలు జరప కూడదు. కానీ సీఆర్‌జెడ్ నిబంధనలు తుంగలో తొక్కి చీకటి వ్యాపారాన్ని సాగిస్తున్నారు.



ఇసుక గుట్టలు

తోటల్లో ఇసుక తవ్వకాలు

తీర ప్రాంతం కావడంతో పంట పొలాలు, తోటల్లో ఇసుక మేటలు పేరుకుపోవడం సర్వసాధారణం, భారీ వర్షాలకు డ్రైనేజీలు, పంట కాల్వల ద్వారా ఇసుక చేలల్లోకి చేరుతుంది. ఎక్కువుగా సరుగుడు, జీడి, మామిడి తోటల్లో ఈ తరహా మేటలు కనిపిస్తుంటాయి. గతంలో ఇలా పేరుకుపోయిన ఇసుక మేటల్ని రైతులు ఉచితంగా ఇచ్చేవారు. ఎవరైనా ఇళ్ల, స్థలాలు పూడికకు ఈ ఇసుకను తోడుకునేవారు. దీనివల్ల రైతులకు ఖర్చు ఉండేది కాదు. అయితే ఈ మట్టి దొరక్కపోవడంతో బొండు ఇసుకకు డిమాండ్ ఏర్పడింది. ఇందులో ఉప్పుశాతం ఉండకపోవడంతో ఇళ్ల కట్టేందప్పుడు పూడిక సమయంలో ఈ ఇసుకను వినియోగిస్తున్నారు. గతంలో ట్రాక్టర్ రూ.200, రూ.500 లకు దొరికేది. నేడు ట్రాక్టర్ రూ.2వేలు పెట్టినా దొరకని పరిస్థితి. కొంత మంది వ్యాపారులు రైతులతో బేరం ఆడుకుని ఎకరం, రెండు ఎకరాలు తవ్వుకుంటు న్నారు. తరలించిన లారీలు, ట్రాక్టర్ల సంఖ్యను బట్టి డబ్బు తీసుకుంటున్నారు. మరి కొందరు మూడు అడుగులు తవ్వుకునే విధంగా ముందుగానే ఒప్పందం చేసుకుని రూ.5 నుంచి రూ.8 లక్షల వరకు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఇక్కడ రైతులు గాని, వ్యాపారులుగాని ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదు. తోటల్లో ఇసుకను తరలించాలంటే ముందుగా రెవెన్యూ అధికారుల అనుమతి తీసుకోవాలి. ఆ తరువాత మైన్స్ శాఖ కూడా ఒప్పుకోవాలి. ఈ ఇద్దరి అనుమతి ఉంటేనే తవ్వకాలు చేసి ఇసుక తరలించాలి, కానీ ఇక్కడ ఈ రెండు శాఖలతో ముందుగా ఒప్పందం కుదుర్చుకుని ఇసుక తరలిస్తున్నారు. అప్పుడప్పుడు సెబ్ పోలీసులు పట్టుకుని కేసులు రాస్తున్నారే తప్ప ఎటువంటి చర్యలు కనిపించడం లేదు.

ప్రభుత్వం మారినా..ఆగని దందా

రాష్ట్రంలో ప్రభుత్వం మారిన ఈ మాఫియా తీరు మారలేదు. ఇందులో ఎక్కువ మంది ఎన్నికల ముందు పార్టీలు ఫిరాయించి దందా సాగిస్తున్నారు. ప్రతి వ్యాపారి వద్ద ఐదు నుంచి పది ట్రాక్టర్లు ఉంటున్నాయి. చిన్న చిన్న ఎస్కలేటర్లు కూడా కొను గోలు చేశారు. వీటి సాయంతో సులభంగా ఇసుక తవ్వేస్తున్నారు. దీన్ని నియంత్రించ కపోతే రానున్న రోజుల్లో పెను ముప్పు తప్పదంటున్నారు పర్యా వరణ శాస్త్రవేత్తలు. గతంలో ఈ చీకటి వ్యాపారంపై దుమ్మెత్తిపోసిన నేతలు నేడు ప్రభుత్వం మారడంతో ఏ విధంగా అడ్డుకట్ట వేస్తారో..అన్న చర్చ తీరంలో సాగుతోంది.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి..

ఖరీఫ్‌కు ఇబ్బందులు తలెత్తకూడదు

పంట కాల్వల్లో గుర్రపు డెక్క, కిక్కిస తొలగింపు పనులు చేపట్టండి : కలెక్టర్

భీమవరం టౌన్, జూలై 2 : ఖరీఫ్ సాగుకు నీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన పనులను వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ ప్రవీణ్ ఆదిత్యతో కలిసి సాగునీటి పనులపై సమీక్షించారు. ఖరీఫ్ సాగుకు శివారు భూములకు సైతం నీరు అందేలా అవసరమైన పనులను వెంటనే చేపట్టాలన్నారు. కాలువల్లో, డ్రెయిన్లలో నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా గుర్రపుడెక్క, కిక్కిస తొలగింపు వంటి అత్యవసరమైన పనులను మొదటి దశలో చేపట్టాలన్నారు. ఇప్పటికే ఓఅండ్ఎం కింద పనులు మంజూరయ్యాయని త్వరితగతిన టెండర్లు పూర్తిచేసి పనులను ప్రారంభించాలన్నారు. తొలగించిన చెత్తను గట్ల మీద వేయకుండా దూరంగా తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమైన పనులను నవంబర్‌లో చేపట్టేలా ప్రతిపాదలను సిద్ధం చేయాలని సూచించారు. తాడేపల్లిగూడెం, తణుకు, ఉండి, నరసాపురం సబ్ డివిజన్‌ల పరిధిలో లాకులు కొత్తవి అమర్చడం, మరమ్మతులు వంటి 49 పనులకు సంబంధించి రూ5.79 కోట్లకు ఓఅండ్ఎం కింద నిధుల మంజూరుకు ప్రతిపాదనలను పంపినట్టు జలవనుల శాఖ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. తాడేపల్లిగూడెం సబ్ డివిజన్ పరిధిలో తూడు తొలగింపునకు ఈనెల 4న టెండర్లకు చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. కాలువల్లో పూడికతీతకు సంబంధించి 20 పనులు మంజూ రయ్యాయని కెనాల్స్ ఈఈ దక్షిణామూర్తి తెలిపారు. ఏ పనుల చేపట్టినా సంబంధిత ప్రాంతాల్లోని రైతులకు ముందుగా తెలియజేసి వారి సమక్షంలో పనులు చేపట్టాలని జల వనరుల శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పనుల్లో నాణ్యత ఎట్టి పరిస్థితుల్లో తగ్గకూడదని తెలిపారు. జల వనరుల శాఖ అధికారి ఎంవీవీ కిషోర్, గోదావరి హెడ్ వాటర్ వర్క్స్, రిజర్వ్ కన్జర్వేటర్ ఈఈ కాశీ విశ్వేశ్వరరావు, డీఈలు, ఏఈలు, పాల్గొన్నారు.



1067 ఉపాధ్యాయ ఉద్యోగాలు

- మెగా డీఎస్సీకి మరో ముందడుగు
- యాజమాన్యాల వారీగా వేకెన్సీల ఖరారుపై తుది కసరత్తు
- ఉపాధ్యాయ నియామకాలకు చంద్రబాబు ప్రభుత్వంలో మోక్షం
- ఇన్‌సర్వీస్ టీచర్లకూ ఉపశమనమే

ఏలూరు అర్బన్, జూలై 2: నిరుద్యోగ అభ్యర్థుల ఆకాంక్షలకు అనుగుణంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించింది. ఉపాధ్యాయ నియామకాలు చేపట్టేందుకు జిల్లా విద్యాశాఖ కసరత్తు దాదాపు కొలిక్కి వచ్చింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పాఠశాల విద్యాశాఖతోపాటు, గిరిజన, సాంఘిక, వెనుకబడిన తరగతులు తదితర సంక్షేమ శాఖల యాజమాన్యాల్లోని పాఠశాలలు, గురుకులాలు, మోడల్ స్కూల్స్‌లో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ కేడర్లలో మొత్తం 1067 ఉపాధ్యాయ నియామకాలకు కూటమి ప్రభుత్వం ఇటీవల గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన విషయం విదితమే. ఆ మేరకు పాఠశాల విద్యాశాఖలో మంగళవారం సాయంత్రం వరకు అన్ని కేడర్లలో కలిపి మొత్తం 725 వేకెన్సీలను గుర్తించారు. మిగతా 342 ఖాళీలను సంక్షేమ శాఖల యాజమాన్యాల్లోని పాఠశాలల్లో భర్తీ చేసేందుకు అవకాశం ఉంది. ఈ సంఖ్యల్లో కొద్దిపాటి మార్పులతో దాదాపు తుదిగా భర్తీచేసే పోస్టులు యాజమాన్యాలవారీగా ఇవే ఉంటాయని సమాచారం. ఉమ్మడి జిల్లాలో అధికారికంగా యాజమాన్యాలవారీగా నోటిఫైచేసే పోస్టులపై బుధవారం ఒక స్పష్టతవచ్చే అవకాశం ఉంది.

నిరుద్యోగుల ఆకాంక్షలకనుగుణంగా...

గత వైసీపీ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో కేవలం 228 ఉపాధ్యాయ పోస్టుల ను నోటిఫైచేసింది. క్షేత్రస్థాయిలో ఉద్యోగ ఖాళీలు అధికంగా ఉన్నా ఉన్నప్పటికీ జగన్ ప్రభుత్వం నిరుద్యోగుల ఆశలను నీరుగార్చేలా నోటిఫికేషన్ జారీ చేసిందని అప్పట్లో విద్యార్థి సంఘాలు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో డిగ్రీ, పీజీ విద్యార్హతలతో డీఎడ్, బీఎడ్ ఉపాధ్యాయ విద్య శిక్షణ పూర్తిచేసుకున్న వేలాది మంది నిరుద్యోగులకు ఊరట కలిగించేలా కొత్తగా అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం తొలి సంతకాన్ని మెగా డీఎస్సీపై చేయడంతో ఉపాధ్యాయ అభ్యర్థుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఇంతకుముందు నోటిఫై చేసిన 228 పోస్టులకు అదనంగా 839 పోస్టులను చేర్చి మొత్తం 1067 ఉపాధ్యాయ నియామకాలకు నిర్ణయం తీసుకున్నారు. ఇలా పెంచిన పోస్టులను భర్తీచేయడానికి ఉమ్మడి జిల్లాలో వేకెన్సీలను ఖరారు నిర్ణయాలతో నిరుద్యోగులకు ఊరట కలిగించనున్నారు. దీనికోసం పలు విదానపరమైన ఆలోచనలతోనే పోస్టుల సంఖ్య, వేకెన్సీల నిర్ధారణల్లో కొత్త ఒరవడి తీసుకురానున్నారు. ఆ ప్రకారం శాంక్షన్డ్ పోస్టులు ఉన్నా కూడా ఏళ్ల తరబడి భర్తీచేయకుండా నిలిపివేసిన పోస్టులను ఇపుడు ఇతర కేడర్లలోకి కన్వర్ట్ చేయడం ద్వారా మెగా డీఎస్సీలో నింపనున్నారు. ఈ క్రమంలో బాలికా విద్యార్థులు లేక ఏళ్ల తరబడి భర్తీకాకుండా ఉంచిన ఎల్ఎఫ్ఎల్ (లో ఫిమేల్ లిటరసీ) ప్రధానోపాధ్యాయుల వేకెన్సీలను ఇపుడు మెగా డీఎస్సీకోసం పోస్టులను కన్వర్ట్‌చేసి స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో నియామకాల సంఖ్యను పెంచనున్నారు. పదోన్నతులకు పదుల సంఖ్యలో సిద్ధంగా వున్న హైస్కూల్ హెచ్ఎం పోస్టులను ప్రమోషన్లపై భర్తీ చేయడం ద్వారా ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో కొత్త పోస్టులను సృష్టించి మెగా డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌కు చేర్చనున్నారు. ఇటువంటి ఆలోచనను గత వైసీపీ ప్రభుత్వం చేయకపోవడం వల్ల వేల సంఖ్యలో ఉపాధ్యాయ ఖాళీలు ఏళ్ల తరబడి మిగిలిపోతున్నాయని నిరుద్యోగ అభ్యర్థులు వాపోతున్నారు. మరోవైపు పెద్దసంఖ్యలో ఉపాధ్యాయ నియామకాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలకు పాటిస్తున్న ఉపాధ్యాయుడు:విద్యార్థుల నిష్పత్తి(1:20)ని తగ్గించే అవకాశాలూ లేకపోలేదని తెలుస్తోంది. అదే జరిగితే ప్రభుత్వ పాఠశాలల టీచర్లకు కూటమి ప్రభుత్వం భారీ ఊరటనిచ్చినట్లేనని భావిస్తున్నారు. ఏదేమైనా మెగా డీఎస్సీ నోటిఫికేషన్ అటు నిరుద్యోగుల్లోను, ఇటు ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల్లోను సంతోషాలు పండించడం ఖాయమని చెప్పవచ్చు.

839 పోస్టులు అదనం

వైసీపీ ప్రభుత్వం 228 పోస్టులకే నోటిఫై చేయగా, చంద్రబాబు కూటమి ప్రభుత్వం వీటికి అదనంగా 839 పోస్టులు చేర్చడం ద్వారా మొత్తం 1,067 పోస్టులను భర్తీ చేయాలని సంకల్పించింది. ఆ ప్రకారం.. చంద్రబాబు ప్రభుత్వం కొత్తగా 839 పోస్టులను మెగా డీఎస్సీకి చేర్చడానికి పరిశీలిస్తే ఇంతకాలం ఈ పోస్టులు ఉన్నప్పటికీ జగన్ ప్రభుత్వం భర్తీ చేకుండా ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేయడానికే పన్నాగం పన్నినట్టు స్పష్టమవుతోంది.



పోలవరం ప్రాజెక్టు వద్ద మంగళవారం అధికారులతో సమీక్షించిన అనంతరం స్పిల్‌వేపై నుంచి పరిశీలిస్తున్న జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు.. - మెయిన్‌లో

- మెయిన్‌లో

ఒకే రోజు పెన్షన్ల పంపిణీ.. కూటమి సక్సెస్

నాడు మండుటెండలో నానా ఇబ్బందులు : మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్, జూలై, 2 జగన్ దుర్మార్గపు ఆలోచనతో రాజకీయ లబ్ధి పొందాలనే ఉద్దేశ్యంతోనే నాడు పెన్షన్ల కోసం మండుటెండలో, వడగాల్పుల్లో పెన్షన్ దారులను తిప్పి 34 మంది వృద్ధులు మృతి చెందడానికి కారణమయ్యాడని జలవనరుల శాక మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఒక్కరోజులోనే ఇంటింటికీ వెళ్లి 95 శాతం మందికి పెన్షన్ సొమ్ములు అందజేయడం కూటమి ప్రభుత్వ విజయమేనని అన్నారు. పాలకొల్లులో క్యాంపు కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇళ్లవద్దనే పెన్షన్లను పంపిణీ చేయవచ్చని నాడు చంద్రబాబు, పవన్ కల్యాణ్ చెప్పినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. పెంచిన పెన్షన్‌ను విడతలుగా కాకుండా ఒకేసారి ఇవ్వడంతో అవ్వా తాతల్లో చిరు నవ్వులు చూశామన్నారు. దివ్యాంగులు రెట్టింపు పెన్షన్ సొమ్ము తీసుకొని సంతోషం వ్యక్తం చేశారన్నారు. రానున్న రోజుల్లో అర్హత కల్గిన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామన్నారు. రాష్ట్ర టీడీపీ కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పట్టణ, మండలాల టీడీపీ అధ్యక్షుడు గండేటి వెంకటేశ్వరరావు, కోడి విజయభాస్కరరావు, గొట్టుముక్కల సూర్య నారాయణరాజు, మామిడిశెట్టి పెద్దిరాజు, నాయకులు బొప్పన హరికిషోర్, పాముల రజిని తదితరులు పాల్గొన్నారు.

పట్టిసీమకు జలకళ

ఐదేళ్ల తర్వాత నేడు నీటిని విడుదల చేయనున్న మంత్రి నిమ్మల



పట్టిసీమ ఎత్తిపోతల పథకం (ఫైల్)

పోలవరం, జూలై 2 : ఐదేళ్ల తర్వాత పట్టిసీమ ఎత్తిపోతల పథకం మళ్లీ కళకళలాడనుంది. గత ప్రభుత్వ పాలనలో పూర్తిగా పడకేసి రైతులకు సాగు నీటి కష్టాలను మిగిల్చిన ఈ పథకం ద్వారా రాష్ట్ర భారీ జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు బుధవారం ఉదయం 7.27 గంటలకు నీటిని విడుదల చేయనున్నారు. దీనిపై ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి డెల్టాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యేలోగా రైతులు సాగు నీటి కోసం ఇబ్బందులు పడకూడదనే దృక్పథంతో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు రూ.1,600 కోట్లతో ఏడాది వ్యవధిలోనే పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. దీని నుంచి 1800 క్యూసెక్కుల జలాలు పంపిణీ జరిగేది. దీనిద్వారా ఏటా నాలుగు లక్షల ఎకరాల్లో సాగు చేసేవారు. టీడీపీ ప్రభుత్వం పట్టిసీమ ఆరంభం నుంచి 2019 రబీ సీజన్ వరకూ 305.07 టీఎంసీల నీటిని కృష్ణా, రాయలసీమ, ఉమ్మడి పశ్చిమ డెల్టాలకు పంపిణీ చేసింది. తర్వాత వైసీపీ ప్రభుత్వ పాలనలో పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని నాలుగేళ్ళు పడకేయించి రైతుల ఉసురు పోసుకుంది. 2020లో 4.5424 టీఎంసీలు, 2021లో 1.6417 టీఎంసీలు పంపిణీ చేసింది. నాలుగేళ్ళలో 58.7421 టీఎంసీలు మాత్రమే ఇచ్చింది. దీనివల్ల రైతులకు సాగు నీరందక, పంటలు నష్టపోయి విరామం పాటించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాది పంటలకు సాగు నీటి కోసం ఎదురు చూస్తున్న రైతులకు పట్టిసీమ నేటి నుంచి జీవధార కానుందని రైతులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు.

ఉసురు తీసిన లోన్‌యాప్

చీరాలలో తాడేపల్లిగూడెం వాసి బలవన్మరణం



చీరాల టౌన్, జూలై 2 : లోన్ యాప్‌లు తాడేపల్లిగూడేనికి చెందిన చిరుద్యోగి ఉసురు తీశాయి. వేధింపులు తాళలేక అతను ఆత్మ హత్య చేసుకున్నాడు. తాడేపల్లిగూడేనికి చెందిన కోరాడ అయ్యప్ప కుమార్ (40) చీరాలలో ఓ ప్రైవేటు ఫైనాన్స్ బ్యాంకులో పనిచేస్తున్నాడు. 2021 నుంచి భార్య జ్యోతి, మూడేళ్ల కుమారుడితో అక్కడే ఉంటున్నాడు. చాలీచాలని జీతాలు కారణంగా 20 రోజులుగా చీరాలలోనే మరో ప్రైవేటు బ్యాంకులో చేరారు. ఈ క్రమంలోనే ఇతను లోన్‌యాప్‌ల వలలో పడ్డాడు. వారు వడ్డీపై వడ్డీలు వేశారు. అవి కట్టేందుకు మళ్లీ అప్పు చేశాడు. అయినా పరిస్థితులు సర్దుబాటు కాకపోవడంతో భార్యకు విషయం తెలియకుండా ఉండేందుకు అప్పుడప్పుడు పట్టణంలోని ఓ లాడ్జికు వెళ్లి మద్యం తాగడం అలవాటు చేసుకున్నాడు. చివరకు బాకీలు తీర్చే పరిస్థితి లేకపోవడం, యాప్ నిర్వాహకుల వేధింపులు తట్టుకోలేక సోమవారం మధ్యాహ్నం లాడ్జిలో మద్యం బాగా సేవించి కుడి ముంజేతిని బ్లేడుతో పలుచోట్ల కోసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. లాడ్జి నిర్వాహకులు తలుపు తెరిచి చూడగా రక్తపు మడుగులో అయ్యప్ప విగతజీవిగా పడివుండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై వేమన సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. పోస్టు మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్ప గించారు.తల్లిదండ్రులు లేకపోవడంతో అంత్యక్రియలు కూడా చీరాల్లోనే ముగించారు. అతని మరణంతో ఆ కుటుంబం దిక్కులేని పరిస్థితిలోకి వెళ్లింది.

నీట్ పరీక్ష రద్దు చేయాలి

రేపు విద్యా సంస్థల బంద్ : ఎస్ఎఫ్ఐ

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 2 : నీట్ పరీక్ష రద్దు చేసి ఈ పరీక్షపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని, వివిధ డిమాండ్ల సాధనకు వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా గురువారం విద్యా సంస్థల బంద్ నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రసాద్ తెలిపారు.మంగళవారం ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ సంఘాల ఆధ్వర్యంలో సీఎస్ఎన్ కళాశాలలో కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రసాద్ మాట్లాడుతూ నీట్ స్కాంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్టీయేను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా సంస్థల బంద్‌కు వివిధ ప్రైవేటు, కార్పొరేట్ ప్రభుత్వ విద్యా సంస్థల అధిపతులు సంపూర్ణ మద్దతు తెలియజేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.గణేష్, జి.శ్రీను, ఏఐఎస్ఎఫ్ నాయకులు పి.పవన్, ఎస్ఎఫ్ఐ టౌన్ అధ్యక్షుడు పవన్, సాయి, డి.ప్రణీత్, తదితరులు పాల్గొన్నారు.



సీఎస్ఎన్ కళాశాల వద్ద కరపత్రాలను ఆవిష్కరించిన సభ్యులు

ఆకివీడు హైస్కూల్‌కు నిధులివ్వండి

మంత్రి లోకేశ్‌కు ఎమ్మెల్యే రఘురామ లేఖ



పాఠశాల క్రీడా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు

ఆకివీడు/భీమవరం టౌన్,జూలై 2: గత ప్రభుత్వంలో హైస్కూల్ ప్లస్‌కు నిలిచిన నిధులు విడుదల చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఎమ్మెల్యే కనుమూరి రఘురామ కృష్ణరాజు లేఖ రాశారు. ఆకివీడు జిల్లా పరిషత్ బాలురున్నత పాఠశాలలో హైస్కూల్ ప్లస్‌కు నాడు-నేడులో చేపట్టిన పనులు నిలిచిపోయాయని ఎమ్మెల్యే దృష్టికి హెచ్ఎం తోట పోతురాజు తీసుకెళ్లడంతో మంగళవారం ఆయన పరిశీలించారు. గత ప్రభుత్వంలో నాడు -నేడు ద్వారా రూ.56 లక్షలు నిధులు విడుదల కాగా రూ.35 లక్షలు పనులు జరిగాయని, మిగిలిన రూ.21 లక్షలు మండలంలో ఇతర పాఠశాలకు బదిలీ చేశారని వివరించారు. టీడీపీ మండల-పట్టణ అధ్యక్ష-కార్యదర్శులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, నౌకట్ల రామారావు, గంధం ఉమా, గొంట్లా గణపతి, కనుమూరు అబ్బాయిరాజు, ఉపాధ్యాయులు అరవింద్, వెంకటస్వామి తదితరులు ఉన్నారు. ఉండి నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులన్ని వచ్చేనెల 15 నాటికి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గపరిధిలో డ్రైనేజీ, కాల్వల్లో గుర్రపుడెక్క, సిల్టు తొలగింపు పనులకు రాష్ట్ర ప్రభుత్వం ఎక్కువగానే సహకారం అందిస్తోందన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తామన్నారు.



కారును చూసేందుకు భారీగా చేరుకున్న అభిమానులు (ఇన్‌సెట్‌లో) బుజ్జి కారు

భీమవరంలో 'కల్కి' కారు

భీమవరం అర్బన్, జూలై 2: పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటించిన కల్కి 2898 ఏడీ సినిమాలో ప్రభాస్ వినియోగించిన కారు (బుజ్జి)ను భీమవరం తీసుకొచ్చారు. అభిమానులకు చూపించేందుకు చిత్రబృందం భీమవరంలోని గీత మల్టీప్లెక్స్ ప్రాంగణంలో మంగళవారం ఉంచారు. దీనిని చూసేందుకు ప్రభాస్ అభిమానులు భారీగా తరలివచ్చి 'బుజ్జి' కారుతో సెల్ఫీలు దిగుతూ ఫిదా అయ్యారు.

విద్యా, క్రీడా సమాచారం

ఓపెన్ స్టడీ సెంటర్ల అనుమతికి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు ఎడ్యుకేషన్, జూలై 2 :ఏపీ ఓపెన్ స్కూల్స్ దూరవిద్య టెన్త్, ఇంటర్మీడియట్ కోర్సులకు జిల్లాలో కొత్త స్టడీ సెంటర్లకు అనుమతి ఇచ్చేందుకు ప్రభుత్వ/ఎయిడెడ్/మున్సిపల్/ప్రైవేటు హైస్కూళ్ళు, జూనియర్ కళాశాలల యాజమాన్యాల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులను ఏపీ ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్‌నుంచి పొందవచ్చన్నారు. ఇప్పటికే అనుమతి తీసుకున్న స్టడీ సెంటర్లు కూడా రెన్యువల్ చేసుకోవాలని సూచించారు.

డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ

ఏలూరు ఎడ్యుకేషన్, జూలై 2 :ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ఆన్‌లైన్ ప్రవేశాలకు ఉన్నత విద్యామండలి మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసిందని ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లకు విద్యార్థులు ఈనెల పదో తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, కళాశాల, కోర్సు ఎంపికకు 11నుంచి 15వరకు ఆన్‌లైన్‌లోనే ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అడ్మిషన్లు, కోర్సుల ఎంపికకు విద్యార్థుల కోసం తమ కళాశాలలో ఉచిత హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, విద్యార్థులు ఈ సెంటర్‌ను వినియోగించుకోవాలని సూచించారు.

రెండో రోజు కొనసాగిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్



ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ కోర్సుల ప్రవేశానికి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో పాల్గొన్న విద్యార్థులు

నూజివీడు టౌన్, జూలై 2: రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని ట్రిపుల్ ఐటీల్లో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రత్యేక కేటగిరి అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. మంగళవారం నూజివీడు ట్రిపుల్ ఐటీలో సైనిక సంతతికి చెందిన విద్యార్థులు 62 మంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 113 మంది మొత్తం 175 మంది విద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు అయ్యారు. అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్రకుమార్ ఆధ్వర్యంలో ట్రిపుల్ ఐటీ అధికారులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించగా, బుధవారం సైనిక సంతతికి చెందిన విద్యార్థులు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, దివ్యాంగులు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కేటగిరిల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ట్రిపుల్ ఐటీ అధికార వర్గాలు తెలిపాయి.



ప్రశంసాపత్రాలతో విజేతలు

ఉత్సాహంగా ఓపెన్ చెస్ పోటీలు

ఏలూరు స్పోర్ట్స్, జూలై 2: ఏలూరు శాంతినగర్ 7వ రోడ్డులోని బచ్‌పన్ స్కూల్ ప్రాంగణంలో అబ్రహం, గ్యారీ కాస్పరోవ్ ఏలూరు జిల్లా స్థాయిలో ఓపెన్ చెస్ పోటీలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. టెస్లా కంపెనీ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జి.కార్తీక్ చెస్ పోటీలను ప్రారంభించారు. పోటీల్లో జి.అనురూప్ మోషే ప్రథమస్థానం, జి.అభిషేక్ అబ్రహం ద్వితీయ, ఎం.విక్రాంత్ తృతీయస్థానం సాధించారు. ఏజ్ గ్రూప్‌లో ఎస్.స్టీవెన్, టి.నవనీత్, లోహిత్, కార్తికేయ, ఎం.కాంస్య, ఎం.చిరస్మీ, జి.జ్ఞానసంకేత్, శ్రేయస్‌లు గెలుపొందారు. వీరికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అకాడమి డైరెక్టర్ యోహానన్ పర్యవేక్షించారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి నాటిక పోటీలు

ఏలూరు కల్చరల్, జూలై 2: ఏలూరు వైఎంహెచ్ఏ ప్రాంగణంలో ఈనెల 4,5,6,7 తేదీల్లో అల్లూరి సీతారామరాజు స్మారక రాష్ట్రస్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్టు వైఎంహెచ్ఏ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు ఎర్రా సోమలింగేశ్వరరావు, ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి వేమా కోటేశ్వరరావు, కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు జవ్వాజి మోహన్‌విఠల్, ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు, హేలాపురి కళా పరిషత్ అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ తెలిపారు. వైఎంహెచ్ఏ, హేలాపురి కళా పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఎంతో ఘనచరిత్ర కలిగిన నాటక కళా సమాజాలచే ఏడు నాటికలు ప్రదర్శిస్తారన్నారు. 4వ తేదీన రాత్రి 'రాజుగారి గోడి', 5న 'రాటా', 6న 'ఇంద్రప్రస్థం', 'మళ్లీ కలిసి జీవిద్దాం', 7న 'కౌసల్య, సుప్రజ, రామ' తదితర నాటికలు ప్రదర్శిస్తారన్నారు. ప్రత్యేక ప్రదర్శనలుగా మయసభ ఏకపాత్రాభినయం, పద్యనాటకం, ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

10,11 తేదీల్లో రైతు సంఘ శిక్షణ తరగతులు

ద్వారకాతిరుమల, జూలై 2: రైతు సంఘ జిల్లాస్థాయి శిక్షణ తరగతులు మండలంలోని ఎం.నాగులపల్లి గ్రామంలో ఈనెల 10,11 తేదీల్లో జరుగుతాయని సంఘ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. గ్రామంలో మంగళవారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ స్థానిక రైతు ఉత్పత్తిదారుల సంఘ భవనంలో సమావేశం జరుగుతుందన్నారు. వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులు, ప్రభుత్వ విధానా లపై సంఘ రాష్ట్ర నాయకులు మాట్లాడతారన్నారు. గత ఐదేళ్లగా వైసీపీ పాలనలో దొండ పందిళ్ల సబ్సిడీ బకాయిలను అందించలేదని, వాటిని విడుదల చేసి రైతులకు అందించి ఆదుకోవాలన్నారు.

తరుముకొస్తున్న ప్లాస్టిక్ భూతం



మానవ జీవితంలో భాగమైన ప్లాస్టిక్

నేడు అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల వ్యతిరేక దినం

ప్లాస్టిక్.. మానవ జీవితంలో భాగంగా మారింది. ప్లాస్టిక్ వినియోగం లేనిదే మనిషి దైనందిన జీవితం ప్రారంభం కావడంలేదు. ఉదయం లేచింది మొదలుకుని, రాత్రి నిద్రించే వరకు ప్లాస్టిక్ వినియోగించని మనిషి కనిపించడం లేదు. ప్లాస్టిక్ వినియోగంలో భారతీయులు సగటున ఏడాదికి సుమారు 12 కేజీలు వినియోగిస్తుండగా అమెరికన్లు సుమారు 110 కిలోలు వినియోగిస్తున్నారు. ఈ సంఖ్యను చూసి మనం మురిసి పోయే అంత అవకాశం లేదు. ఎందుకంటే భారతీయ జనాభాతో పోలిస్తే అమెరికాలో ఐదో వంతే జనాభా ఉన్నారు. భూభాగం విషయానికి వస్తే మన దేశ విస్తీర్ణం కన్నా అమెరికా దేశ విస్తీర్ణం మూడు రెట్లు అధికంగా ఉంది. ఈ గణాంకాలతో పోల్చి చూసినప్పుడు చదరపు మీటరు విస్తీర్ణంలో అమెరికా కన్నా మన దగ్గరే ప్లాస్టిక్‌వ్యర్థాలు అధికంగా ఉన్నాయి. నేడు అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల వ్యతిరేక దిన సందర్భంగా ప్రత్యేక కథనం.

పాలకొల్లు, జూలై 2 :
మన దేశానికి 900 మిలియన్ అమెరికన్ డాలర్లు విలువ చేసే ప్లాస్టిక్ క్రాప్ ఏడాదికి ఇతర దేశాల నుంచి దిగుమతి అవుతుంది అంటే ప్రమాదం ఏ స్థాయిలో ఉందో తెలుస్తోంది. ప్రస్తుతం ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిపైనే కాకుండా నదీ జలాలు, సముద్రజలాల్లో కలిసి నీటి చరాలను సైతం ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఒక అంచనా ప్రకారం సముద్ర జీవాలు 2050 నాటికి 99శాతం ఉంటే ప్లాస్టిక్ వ్యర్థాలు వంద శాతానికి చేరతాయని, పలు అధ్యయనాల ద్వారా తెలుస్తోంది. చేపలు, ఇతర జల చరాలు, మైక్రో ప్లాస్టిక్ తినడంద్వారా మత్స్య ఉత్పత్తి నానాటికీ క్షీణిస్తోంది.

వ్యవసాయానికి పెనుముప్పు..

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 11 లక్షలకు పైబడి హెక్టార్లలో వరి, మరి అంత విస్తీర్ణంలో ఇతర పంటలు పండిస్తున్నారు. వ్యవసాయ పంటలకు ఇప్పుడు ప్లాస్టిక్ పెనుముప్పుగా మారింది. ఒక వైపు జల చరాలకు ప్రమాదంగా మారగా, మరోవైపు భూమిపై వ్యవసాయ పంటలకు, మూగ జీవాలకు ప్రాణ సంకటంగా మారింది. ముఖ్యంగా పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలో వృథా ఆహారంతో కలిసి ఉన్న క్యారీ బ్యాగులను ఆవులు, ఇతర మూగ జీవాలు తినడం ద్వారా అవి ప్రాణాలు కోల్పోతున్నాయి. అంతేకాకుండా గోవులు ప్లాస్టిక్ వ్యర్థాలు తింటూ ఆరోగ్యంగా ఉన్న సమయంలో అవి ఇచ్చే పాలల్లో సైతం ప్లాస్టిక్ సూక్ష్మాలు కనిపిస్తున్నాయి.

- » ప్రత్యామ్నాయ వస్తువులు చూపడంలో ప్రభుత్వం విఫలం
- » నిషేధం అసాధ్యం అంటున్న నిపుణులు
- » రీ-సైక్లింగ్‌తో పరిష్కారం
- » ఏడాదిలో భారతీయులు సగటున 12 కేజీలు, అమెరికన్లు 110 కేజీల వినియోగం
- » మిషన్-2022ను నెరవేర్చ లేకపోయిన ప్రధాని మోదీ



ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్న ఆవులు

జీవితంలో భాగం..

నేటి ఆధునిక జీవితంలో 50శాతం పైబడి పౌరులు సెల్‌ఫోన్లకు బానిసలు కాగా, పేద గొప్పతారతమ్యం లేకుండా నూరుశాతం ప్రజలు ప్లాస్టిక్‌కు బానిసలుగా మారారు. ప్రతీ పౌరుని జీవితంలోనూ ప్లాస్టిక్ భాగం అయింది.

వినియోగం మానలేమా ?

రూపాయి షాంపు ప్యాకెట్ మొదలుకొని, చిల్లర తిండ్లు, ఆయిల్ ప్యాకెట్లు, పాల ప్యాకెట్లు ఇలా ప్రతీ నిత్యావసర వస్తువు, ప్లాస్టిక్ సంబంధిత ప్యాకింగ్‌లోనే వస్తున్నాయి. ప్రత్యామ్నాయం కనిపించడం లేదని నూరుశాతం నిషేధించడం కుదరదని నిపుణులు చెబుతున్నారు. 40 మైక్రాన్ల (భూమిలో త్వరగా కలిసే ప్లాస్టిక్) వినియోగం కూడా పూర్తిస్థాయిలో సాధ్యం కాలేదు

రీసైక్లింగ్‌తో పరిష్కారం..

ప్లాస్టిక్ నిషేధించడం కంటే రీసైక్లింగ్‌కి యూనిట్లు నెలకొల్పి ప్రభుత్వమే నేరుగా స్థానిక సంస్థల ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలను కొనుగోలు చేసి భూమిలోనూ, నీటిలోనూ కలవకుండా చూడాలని నిపుణులు సూచిస్తున్నారు.

నెరవేరని ప్రధాని మోదీ కల..

2022 సంవత్సరాంతానికే దేశంలో పూర్తిస్థాయిలో ప్రమాదకర ప్లాస్టిక్‌ను నిషేదిస్తామని ప్రధాని మోదీ చెప్పినప్పటికీ ఆచరణలో సాధ్యం కాలేదు.

రోడ్ మ్యాప్ తయారు చేయాలి..

క్యారీ బ్యాగులు, ఇతర ప్రమాదకర ప్లాస్టిక్‌లను అమ్మకాలు జరిపే రిటైల్ షాపులపై దాడులు చేసి చేతులు దులుపుకోవడం కాకుండా, ఒక రోడ్ మ్యాప్ తయారు చేసి ప్లాస్టిక్ రీసైక్లింగ్‌కు నడుం బిగిస్తేనే ఫలితాలు ఉంటాయని మేధావులు సూచిస్తున్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వ్యవసాయ కూలీ మృతి

పోడూరు, జూలై 2 : పాలకొల్లు- ఆచంట ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయమై చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై మంగళవారం కేసు నమోదు చేశామని పోడూరు ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు. పెనుమదం పెదపేటకు చెందిన కుసుమే జయరాజ్ (55) వ్యవసాయ కూలీ గత నెల 24న పెనుమదం నుంచి గుమ్మలూరు బైక్‌పై వెళ్తున్నాడు. పైడావ రెల్లివారిపేటకు వచ్చేసరికి అదుపు తప్పి పడిపోయాడు. తలకు బలమైన గాయమైంది. స్థానికుల సమాచారంతో బంధువులు ఆటోలో పాలకొల్లు ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం నిమిత్తం భీమవరం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆసుపత్రి సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. భీమవరం ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

భర్తపై హత్యాయత్నం కేసు నమోదు

పాలకొల్లు రూరల్, జూలై 2 :పాలకొల్లు మండలం చింతపర్రు గ్రామానికి చెందిన బత్తిన నాగముసేంద్ర తన భార్యపై పెట్రోల్ పోసి హత్యా ప్రయత్నానికి పాల్పడ్డాడు. ఎస్ఐ డి.హరికృష్ణ తెలిపిన వివరాలివి.. నీటిపూడి రెబ్కాతో గత కొంతకాలంగా సహజీవనం చేస్తున్నాడు.. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. బాబు పుట్టిన తేదీ ధ్రువపత్రం విషయంలో మాటామాట పెరిగింది. దీంతో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాని తెలిపారు. ఈ ఘటనలో ఇద్దరికీ గాయాలయ్యాయి. పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఊరెళ్లి వచ్చేసరికి ఇంటిని దోచేశారు

» రూ.5 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు చోరీ

పెనుమంట్ర, జూలై 2 : ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లి వచ్చేసరికి ఇంటిలో దొంగతనం జరిగిన ఘటన పెనుమంట్ర మండలం పాలమూరులో ఆదివారం జరిగింది. పోలీసుల తెలిపిన వివరాలివి.. గ్రామంలోని కలిదిండి సుబ్రహ్మణ్యంరాజు ఇంటిలో అద్దెకు ఉంటున్న ఉపాధ్యాయుడు కడలి సత్యనారాయణ ఆదివారం సెలవు కావడంతో ఊరికి వెళ్లారు. సోమవారం తిరిగి వచ్చే సమయానికి తలుపులు తెరిచి ఇంటిలో వస్తువులు చల్లా చదరగా ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం క్లూస్ టీం వేలిముద్రలను సేకరించింది. కడలి సత్యనారాయణ ఇంటిలో ఐదు కాసుల బంగారం ఆభరణాలు, రూ. 50 వేలు విలువ చేసే వెండి వస్తువులు, రూ.50వేల నగదు, స్మార్ట్ ఎల్ఈడీ టీవీ, హోమ్ థియేటర్ చోరీకి గురయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీటి విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని చెబుతున్నారు. ఈ ఘటనపై పెనుమంట్ర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

వివాహిత ఆత్మహత్య.. ముద్దాయికి నాలుగేళ్ల జైలు

ఏలూరు క్రైం, జూలై 2 : ఒక వివాహితను చర్చిలో నుంచి బయటకు పిలిచి తిట్టి, కొట్టి, దుర్భాషలాడి అవమానించిన వ్యక్తిపై నేరం రుజువు కావడంతో నాలుగేళ్ల జైలు శిక్ష, మూడు వేల రూపాయలు జరిమానా విధిస్తూ ఏలూరులోని ఐదో అదనపు జిల్లా జడ్జి జి.రాజేశ్వరి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం వేలివెన్ను గ్రామంలోని కొత్తపేట అంబేద్కర్ నగర్‌కు చెందిన సిర్రా లక్ష్మణరావు 2020 మార్చి 15వ తేదీన ఆ గ్రామంలోని చర్చిలో ఉన్న ఒక వివాహితను బయటకు పిలిపించి అసభ్యంగా తిట్టి, కొట్టి, ఉరివేసుకుని చనిపోవాలని దూషించాడు. మనస్తాపానికి గురైన ఆ వివాహిత తన పిల్లలు ఇద్దరిని ఇంట్లో నుంచి బయటకు పంపి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు గమనించి ఆసుపత్రికి తరలించిన అనంతరం మృతి చెందింది. ఈ ఘటనపై ఆమె భర్త ఫిర్యాదు మేరకు అప్పటి ఉండ్రాజవరం ఎస్ఐ ఎల్.అవినాశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి సిర్రా లక్ష్మణరావును అరెస్టు చేశారు. ఈ కేసులో నిందితుడైన లక్ష్మణరావుపై నేరం రుజువు కావడంతో నాలుగేళ్ళు జైలు శిక్ష, మూడు వేల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

పెన్షన్ సొమ్ము రూ.2.50 లక్షలతో
పంచాయతీ కార్యదర్శి పరారీ

» పెన్షనర్లు ఇబ్బందులు పడకుండా మంత్రి సర్దుబాటు



బి.రాము

పాలకొల్లు రూరల్, జూలై 2: వృద్ధుల పెన్షన్ సొమ్ము తీసుకుని ఒక పంచాయతీ సచివాలయ కార్యదర్శి పరారైన ఘటన మండలంలోని లంకలకోడేరులో సోమవారం జరిగింది. లంకలకోడేరు సచివాలయం గ్రేడ్-5 కార్యదర్శి బి.రాము వృద్ధుల పెన్షన్ల సొమ్ము రూ.2,50,500లతో పరారయ్యాడు. ఈ సొమ్మును ఆదివారం రాత్రి అధికారుల నుంచి తీసుకుని సోమవారం వృద్ధులకు పంపిణీ చేయకుండా కనిపించకుండా వెళ్లిపోయాడు. పంచాయతీ కార్యదర్శి రాజేష్ సోమవారం పాలకొల్లు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాము స్వస్థలం భద్రాచలం వద్ద ఏజెన్సీలోని లంబాడీ తండాకు చెందిన వాడు, అతడికి మొగల్తూరు మండలం కాళీపట్నంలో కార్యదర్శిగా విధుల్లో జాయిన్ అయ్యాడు. భార్యభర్తల మధ్య విబేధాల కారణంగా అతడి భార్య గత కొంతకాలం క్రితం ఆత్మహత్య చేసుకుందని సమాచారం. ఈ నేపథ్యంలో రాము సస్పెండ్ అయ్యాడు. గత ఏడాది నవంబరులో లంకలకోడేరు సచివాలయంలో గ్రేడ్-5 కార్యదర్శిగా నియతులయ్యాడు. అతడికి ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడడం, క్రికెట్ బెట్టింగ్‌లు అలవాటు ఉందని సహచర ఉద్యోగులు చెబుతున్నారు. ఈక్రమంలో పెన్షన్ సొమ్ముతో పరార్ కావడం సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో వృద్ధులు ఇబ్బందులు పడకుండా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఆ సొమ్మును సర్దుబాటు చేయడంతో వృద్ధులకు పెన్షన్లు సకాలంలో చెల్లించారు. సదరు ఉద్యోగిని తక్షణమే అరెస్టు చేసి సొమ్ములు రికవరీ చేయాలని పలువురు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


కడమ్మ స్లూయిజ్‌కి మరమ్మతులు



కడమ్మ స్లూయిజ్‌కి సిబ్బంది మరమ్మతులు

పోలవరం, జూలై 2 : పోలవరం గ్రామ శివారున ఉన్న కడమ్మ స్లూయిజ్‌కి అఖండ గోదావరి రివర్ బండ్ అధికారులు మంగళవారం మరమ్మతులు నిర్వహించారు. ఏఈ సునీల్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది స్లూయిజ్ గేట్లకు మరమ్మతులు నిర్వహించి గ్రీజింగ్ పనులు చేశారు. కొండవాగుల నీరు గోదావరిలోకి వెళ్లేందుకు గత శతాబ్ద కాల చరిత్ర కలిగిన స్లూయిజ్ గేట్లు వరదల సమయాలలో పూర్తిగా మూసుకోకపోవడం వల్ల గోదావరి జలాలు పంట పొలాల్లోకి వెళ్ళడం, కొండ కాల్వల జలాలు గోదావ రిలోకి వెళ్లకపోవడం వల్ల ఏటా రెండువేల ఎకరాల పంటభూములు నీటము నిగి రైతులు నష్టపోతున్న నేపథ్యంలో మరమ్మతులు నిర్వహించినట్లు ఏఈ తెలిపారు.

పెరిగిన గోదావరి.. దిగువకు 43,878 వేల క్యూసెక్కులు



పోలవరం ప్రాజెక్టులో గోదావరి నీటిమట్టం అనూహ్యంగా పెరిగింది. మంగళవారానికి నీటిమట్టం పెరగడంతో స్పిల్వే 48 గేట్ల నుంచి గోదావరి వరద జలాలు దిగువకు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పోలవరం ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 26.290 మీటర్లు, స్పిల్వే దిగువన 16.350 మీటర్లు, కాఫర్ డ్యాంకి ఎగువన 26.350 మీటర్లు, కాఫర్ డ్యాంకి దిగువన 15.130 మీటర్ల నీటిమట్టం నమోదైందని, అదనంగా వస్తున్న 43,878 వేల క్యూసెక్కుల వరద జలాలను దిగువకు విడుదల చేశామని ఈఈ పి.వెంకటరమణ తెలిపారు.

మిస్టరీగా.. బస్టాండ్‌లో బ్యాగ్ చోరీ

» దొంగతనంపై అనుమానాలు అనేకం..

నరసాపురం, జూలై 2: నరసాపురం బస్టాండ్‌లో సోమవారం రాత్రి జరిగిన బ్యాగ్ చోరీ మిస్టరీగా మారింది. దొంగతనంపై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం దీనిపై పోలీసులు ఎటువంటి కేసు నమోదు చేయలేదు. బులియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఐ స్వామిని కలిసి చోరీ వివరాలను వివరించారు. ఫిర్యాదు రూపంలో ఇస్తే దర్యాప్తు చేస్తామని చెప్పడంతో వ్యాపారులు డీఎస్పీని కలవాలని నిర్ణయించుకున్నారు. గుంటూరుకు చెందిన పెద్ద వ్యాపారి గుమస్తా నరసాపురం పట్టణానికి సోమవారం కలెక్షన్, బంగారు ఆభరణాల ఆర్డర్ల నిమిత్తం వచ్చారు. సాయంత్రం వరకు సుమారు రూ.11 లక్షలు వసూలు చేసి, ఆభరణాలకు సంబంధించి సుమారు రూ.25 లక్షల విలువ చేసే 400 గ్రాముల బంగారాన్ని వ్యాపారుల వద్ద తీసుకున్నాడు. వీటిని బ్యాగ్‌లో పెట్టుకుని భీమవరం వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చాడు. బస్సు రద్దీగా ఉండడంతో కిటికీలోంచి సీటులోకి బ్యాగ్ వేసి బస్సు ఎక్కాడు. అయితే సీటులో బ్యాగ్ లేకపోవడంతో వెంటనే చుట్టుపక్కల, బస్సు అంతా గాలించాడు. ఎక్కడా ఆచూకీ లేదు. ఈ విషయాన్ని గుంటూరులోని వ్యాపారికి, స్థానిక బులియన్ వర్తకులకు తెలియజేశాడు. మంగళవారం గుంటూరు నుంచి వచ్చిన ప్రధాన వ్యాపారి స్థానిక వ్యాపారులతో చర్చించాడు. కలెక్షన్, సేకరించిన బంగారం వివరాలను నమోదు చేసుకున్నాడు. కేసు పెట్టకపోవడంపై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోయిన బంగారం, నగదు వివరాలను తెలపాల్సి వస్తే పన్నుపరమైన ఇబ్బందులు వస్తాయన్న ఉద్దేశంతోనే కేసు పెట్టలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీన్ని బులియన్ వ్యాపారులు కొట్టి పారేస్తున్నారు. పోయిన నగదు అలయానికి సంబంధించిన విరాళాల మొత్తం అంటున్నారు. మరోవైపు చోరీపై ఎన్నో అనుమానాలు వినిపిస్తున్నాయి. కలెక్షన్ గుమస్తా వెనుక గుంటూరు నుంచి ఎవరైనా అనుసరించి వచ్చారా.. లేక స్థానికులా.. లేక గుమస్తానే మరికొంత మందితో కలిసి ఈ చోరీ నాటకం ఆడుతున్నారన్న అనే వదంతులు షికారు చేస్తున్నాయి. ఏది ఏమైనా సంచలనం రేకెత్తించిన ఈ కేసులో చిక్కుముడి వీడాలంటే దర్యాప్తు సాగాల్సిందే. ఇది జరగాలంటే కేసు నమోదు కావాలి.

ఆపరేషన్ చేస్తారనే భయంతో రోగి ఆత్మహత్య

» ఆసుపత్రి నాలుగో అంతస్తు నుంచి దూకిన వైనం



ఆసుపత్రిలో కిందపడుకుని ధర్నా చేస్తున్న గొల్లపూడి వాసి

ఏలూరు క్రైం, జూలై 2 : ఆసుపత్రిలో ఆపరేషన్ కోసం చేరిన ఒక రోగి తనకు ఆపరేషన్ చేస్తారనే భయంతో నాలుగో అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముసునూరు మండలం గొల్లపూడికి చెందిన వేమూరి సత్యనారాయణ(40) కొంతకాలం నుంచి అనారోగ్యంతో ఉంటు న్నాడు. అతడిని కుటుంబ సభ్యులు ఏలూరు సమీపంలోని ఆశ్రం ఆసుప త్రిలో ఈనెల ఒకటో తేదీన చేర్పించారు. మంగళవారం పలు వైద్య పరీక్షలు నిర్వహించి రెండు రోజుల్లో ఆపరేషన్ చేస్తామని వైద్యులు మధ్యాహ్నం తెలియజేశారు. ఈ విషయం తెలుసుకున్న అతడు నాలుగో అంతస్తులోని తన రూమ్ బాత్‌రూమ్‌లోకి వెళ్లి మధ్యాహ్నం రెండు గంటల సమయంలో కిటికీ నుంచి కిందకు దూకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. ఆ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నేలపై పడుకుని ధర్నాకు దిగారు. అతడి మరణానికి ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యమేనని ఆరోపించారు. చివరకు పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం మంగళవారం రాత్రి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసును అనుమానస్పద మృతిగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌తో విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు : పృథ్వీతేజ్

ఏలూరుసిటీ, జూలై 2: ఏపీఈపీడీసీఎల్ వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా చెల్లించవచ్చని ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇక మీదట ఫోన్‌పే, జీపే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్స్ నందు విద్యుత్ బిల్లులు చెల్లించేటప్పుడు ఏపీఈపీడీసీఎల్ పేరు కనిపించదు, వినియోగదారులు సంస్థ మొబైల్ యాప్ ఈస్టరన్ పవర్‌ని గూగుల్ పే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని లేదా సంస్థ వెబ్‌సైట్ నుంచి గాని బిల్లులు చెల్లించవచ్చన్నారు. ఏపీఈపీడీసీఎల్ మొబైల్ యాప్‌లోగాని, లేదా సంస వెబ్‌సైట్‌లోగాని బిల్లులు చెల్లించేటప్పుడు వినియోగదారులు తమ ఫోన్‌పే, పేటీఎం, జీపే, ఇతర యూపీఐ యాప్స్‌తో పాటు డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వాలెట్స్ , క్యాష్ కార్డ్స్ వాడుకోవచ్చని వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు.

నేడు మూడు రైళ్ల దారి మళ్లింపు

ఏలూరు క్రైం, జూలై 2 : ఏలూరు మీదుగా నడిచే మూడు రైళ్లను బుధవారం దారిమళ్లిస్తున్నట్టు సౌత్ సెంట్రల్ రైల్వే శాఖ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడ డివిజన్ పరిధిలోని గన్నవరం-పెదఅవుటుపల్లి మార్గమధ్యలో ట్రాఫిక్ మెయింటినెన్స్ దృష్ట్యా విశాఖపట్టణం నుంచి కొల్లంకు ఈనెల 3వ తేదీన ఏలూరు మీదుగా వెళ్లే రైలు 08539ను, ధన్‌బాగ్-తామ్రం వెళ్లే రైలు 06066, బరైనీ- మంగళూరు సెంటర్ వెళ్లే రైలు 06094ను బుధవారం నిడదవోలు, గుడివాడ, విజయవాడ మీదుగా నడుపుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఏలూరు, తాడేపల్లిగూడెం మీదుగా ఈ రైళ్ల రాకపోకలు బుధవారం ఉండవని ప్రయాణికులు గమనించాలని తెలిపారు.

నేడు పాలకొల్లులో ఆక్వా రైతుల జిల్లా మహాసభ

ఉండి, జూలై 2: పాలకొల్లులో బుధవారం నిర్వహించే ఆక్వా రైతుల జిల్లాస్థాయి మహాసభను విజయవంతం చేయాలని ఆక్వా రైతు, స్థానిక ఎంపీటీసీ రుద్రరాజు సూర్యనారాయణరాజు అన్నారు. మంగళవారం ఉండి మండలం కలిగొట్లలో ఆటో ద్వారా నిర్వహించిన ప్రచార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆక్వా పరిశ్రమ ఎదుర్కొంటున్న సంక్షోభంపై రాష్ట్ర, జిల్లాస్థాయి ఆక్వా సంఘం నాయకులు మహాసభలో చర్చిస్తారన్నారు. ఆక్వాకు సంబంధించి చేపలు, రొయ్యల మేతల ధరలు తగ్గించాలని, మందుల ధరలను తగ్గించాలని, ఆక్వా ఉత్పత్తులకు మంచి ధరలను కల్పించి రైతులను ఆదుకునే చర్యలు తదితర వాటిపై నూతన ప్రభుత్వానికి ఒక నివేదికను అందిస్తామన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆక్వా రైతుల మహాసభ నిర్వహణ తెలిపేందుకు ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. అన్ని మండలాల నుంచి ఆక్వా రైతులు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఆక్వారైతులు పాల్గొన్నారు.

మావుళ్ళమ్మ హుండీ ఆదాయం రూ.69 లక్షలు



హుండీల సొమ్మును లెక్కిస్తున్న సిబ్బంది

భీమవరం టౌన్, జూలై 2: మావుళ్ళమ్మ హుండీలను మంగళవారం తెరచి లెక్కించగా 92 రోజులకుగాను 69లక్షల 20వేల 286రూపాయలు ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ బుద్ధమహాలక్ష్మి నగేష్ తెలిపారు. నగదుతోపాటు 154 గ్రాముల బంగారం, 590 గ్రాముల వెండి వచ్చిందన్నారు. విదేశీ కరెన్సీ కూడా వచ్చిందన్నారు.



ఎమ్మెల్సీగా అభ్యర్థిగా హరిప్రసాద్ నామినేషన్‌కు అమరావతిలో మంగళవారం మద్దతు తెలిపిన ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్, పత్సమట్ల ధర్మరాజు, తదితరులు

కాల్వల్లో గుర్రపు డెక్క తొలగించాలి

ఆచంట, జూలై 2: పంట కాల్వలు, మురుగు డ్రెయిన్‌లలో పేరుకుపోయిన చెత్త, గుర్రపుడెక్క నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కేతా గోపాలన్ కోరారు. మంగళవారం సీపీఎం కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో గోపాలన్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆచంట, పోడూరు, పెనుగొండ, మండలాల పరిధిలో నక్కల డ్రెయిన్ విస్తరించి ఉండటంతో వర్షాకాలం వచ్చిందంటే రైతులకు కంటిమీద కునుకు ఉండటం లేదన్నారు. ఒక్క డ్రెయిన్ పరిధిలోనే సుమారు 25 వేల ఎకరాలు పంట భూములు ముంపు బారిన పడే ప్రమాదం ఉందన్నారు.

ఆస్పత్రుల్లో పింఛన్ అందజేత


రాజమండ్రిలో పింఛన్ ఇస్తున్న దివ్యాంగ ఉద్యోగి గోపాల్

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 2: అనారోగ్యంతో ఇతర జిల్లాల్లో చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్లి సచివాలయ ఉద్యోగులు మంగళవారం పింఛన్ పంపిణీ చేశారు. మండలంలోని నవాబుపాలెంకు చెందిన బండి అనూష కాకినాడ ఆసుపత్రిలో డయాలసిస్ చికిత్స తీసుకుంటుండగా ఆమెకు సచివాలయ ఉద్యోగి కేదారి రెడ్డి రూ.10 వేల పింఛన్ అందించారు. కుంచనపల్లికి చెందిన గుమ్మళ్ల బాపాలు, మేకా సూర్యకుమారి రాజమండ్రిలో చికిత్స పొందుతుండగా వారికి సచివాలయ ఉద్యోగి గోపాల్ పింఛన్ పంపిణీ చేశారు.

ఆచంట: ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌లు పంపిణీ కార్యక్రమం రెండవ రోజు మంగళవారం కూడా కొన్ని గ్రామాల్లో కొనసాగింది. అయితే కొంత మంది వృద్ధులు అనారోగ్యం దృష్ట్యా ఆసుపత్రిలో ఉండటంతో ఆసుపత్రి వద్దకు వెళ్లి పింఛన్‌లు కూడా అందించారు. మండల వ్యాప్తంగా 98 శాతం పైగానే పింఛన్‌లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో పి.నరసింహ ప్రసాద్ తెలిపారు.

పాలకొల్లు: పట్టణంలోని 31వ వార్డుకు చెందిన ఓరుగంటి ఝాన్సీకి వితంతువు పెన్షన్‌గా ఇవ్వవలసి ఉండగా ఆమె అనారోగ్యంతో రాజమండ్రిలోని కిమ్స్ బొల్లినేని ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నది. ఝాన్సీకి చెందిన పెన్షన్ రూ.7000లను పాలకొల్లు మున్సిపల్ కార్యాలయం (సచివాలయ) సిబ్బంది మంగళవారం రాజమండ్రి వెళ్ళి ఆసుపత్రిలో పింఛన్ అందించారు.

అన్నసమారాధన

ఆచంట, జూలై 2: ఆచంట వేమవరంలో మారెమ్మ జాతరలో భాగంగా మంగళవారం ఆలయం వద్ద పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. ఈ అన్నసమారాధనలో అనేక మంది భక్తులు పాల్గొనగా కమిటీ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

వేడుకగా శ్రీవారి కల్యాణం

ఆచంట, జూలై 2: పెదమల్లంలో వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి అనంతరం స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించగా ఈ కార్యక్రమాల్లో అనేక మంది భక్తులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి


మొక్కను నాటుతున్న బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ సుభాష్

భీమవరం టౌన్, జూలై 2: బీజేపీ జిల్లా కార్యాలయ ప్రాంగణంలో పార్లమెంట్ కన్వీనర్ పేరిచర్ల వెంకట శ్రీనివాస్ రాజు (సుభాష్) మొక్కను నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిపోతున్న కాలుష్యాన్ని అరికట్టాలంటే ప్రతీ ఒక్కరూ మొక్కలను నాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్‌చార్జి కురెళ్ళ నరసింహారావు, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కాగిత సురేంద్ర, జిల్లా కార్యదర్శి ఆకుల లీలా కృష్ణ, కో కన్వీనర్ చేరుకూరి కృష్ణంరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి గద్దాడ తులసిరామ్, కురెళ్ల మహేష్ పాల్గొన్నారు.

నరసాపురం రూరల్ : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కూటమి నాయకులు అన్నారు. మంగళవారం మండలంలోని చిట్టవరం గ్రామంలో ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు మొక్కలు నాటారు. పెద్ద ఎత్తున మొక్కలు పెంచడం వల్ల కాలుష్యాన్ని పూర్తిగా నివారించి స్వచ్ఛమైన గాలిని అందించవచ్చునన్నారు. ఇటు మండలంలోని అన్ని గ్రామాల్లో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ తాడి లక్ష్మణరావు, పోలిశెట్టి సత్తిబాబు, పండు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి: ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా భావించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పాలకొల్లు ఏఎంసీ మాజీ చైర్మన్ ఉన్నమట్ల కబర్ది పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా కొంతేరు గ్రామంలో ఉన్నమట్ల కబర్ది తన తల్లి వెంకటనరసమ్మతో కలిసి ఇంటి ఆవరణలో మొక్కను నాటారు.

నరసాపురం రోటరీ క్లబ్‌కు 13 అవార్డులు


షీల్డ్‌లతో రోటరీక్లబ్ సభ్యులు

నరసాపురం, జూలై 2: నరసాపురం రోటరీ క్లబ్ చేస్తున్న సేవలకు 13 అవార్డులు దక్కాయి. విజయవాడలో జరిగిన సత్కారం, అవార్డు వేడుకల్లో రోటరీ క్లబ్ నరసాపురం బెస్ట్ సోషల్ సర్వీస్ విభాగంలో డైమండ్ అవార్డు, పబ్లిక్ ఇమేజ్ కేటగిరిలో ప్లాటినం, బెస్ట్ క్లబ్ విభాగంలో ప్లాటినం, నాల్గోవ కేటగిరిల్లో గోల్డెన్ అవార్డు, ఆరు కేటగిరిలో సిల్వర్ అవార్డులు గెలుచుకున్నది. క్లబ్ అధ్యక్షురాలు గన్నాబత్తుల సత్యవతి ఈ అవార్డులను అందుకున్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సూర్యకుమారి, కోట్ల రాంకుమార్, శ్రీవాసు బాబు, మురళీ, కనకం ప్రసాద్, విజయకుమార్, కృష్ణకుమారి, వరలక్ష్మి, రామారావు పాల్గొన్నారు.

రేపు అల్లూరి జయంతి కార్యక్రమాలు

భీమవరం అర్బన్, జూలై 2: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతా రామరాజు శతవర్ధంతి, 127వ జయంతి భీమవరం జువ్వలపాలెం రోడ్డులో అల్లూరి స్మృతివనం వద్ద నెల 4వ తేదీన నిర్వహిస్తున్నట్లు శతవర్ధంతి నిర్వహణ కమిటీ తెలిపింది. మంగళవారం అమరవీరుల స్మృతివనం వద్ద సమావేశం నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుని ఘన నివాళులు కార్యక్రమానికి జిల్లాలోని ప్రజానీకమంతా పాల్గొని జోహర్లు అర్పించాలని కోరారు. భీమవరం బాలోత్సవ కమిటీ అధ్యక్షులు ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు అల్లూరి సీతారామరాజు వేషధారణ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం అర్బన్, జూలై 2: ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. జిల్లాలో ఆక్వా రైతులు రొయ్యలు, చేపలను కష్టపడి పండిస్తున్నారని తెలిపారు. విదేశీ మారక ద్రవ్యం వేల కోట్లు ఆదాయం ప్రభుత్వం పొందుతున్నదన్నారు. కానీ పండించే ఆక్వా రైతులు మాత్రం తీవ్ర నష్టంలో ఉన్నారన్నారు. గత ప్రభుత్వం ఆక్వారంగాన్ని పట్టించుకోలేదని నూతన ప్రభుత్వం ఆక్వా రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయలని కోరారు. గిట్టుబాటు ధరలు, ముడి సరుకులు ధరలు తగ్గినా ఫీడ్ ధరలు తగ్గకపోవడం అన్యాయం అన్నారు. విద్యుత్ రాయితీ హామీని తక్షణం అమలు చేయలన్నారు.

శ్మశాన స్థలం ఆక్రమణపై విచారణ

ఆకివీడు, జూలై 2: స్థానిక అమృతరావునగర్ కాలనీ శ్మశానంలో స్థలాలు ఆక్రమించుకొని కొందరు నివాసముంటున్నారని భాస్కరరావు అనే వ్యక్తి భీమవరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ఫిర్యాదు చేశారు. దీనితో మంగళవారం తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరీ ఆ ప్రాంతానికి వెళ్ళి విచారించారు. ఆక్రమణదారులు మాట్లాడుతూ తాము ఇక్కడ నలభై ఏళ్ళ పైబడి ఉంటున్నామని, ప్రభుత్వం ఇటీవల స్థలాలు కేటాయించిందని, తాము పునాదులు లేపుకున్నామని, ఇళ్లు నిర్మించుకోవడానికి తమ దగ్గర డబ్బులు లేవని ప్రభుత్వం నిర్మాణం చేపడితే వెళ్ళి పోతామన్నారు. ఈ విషయాలు ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు.






మంత్రి నిమ్మలను కలిసిన చిన్నారి తల్లిదండ్రులు... వీరవాసరం మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజిబాబు... పాలకోడేరులో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే రఘురామ, జేసీ ప్రవీణ్ ఆదిత్య.. పెనుమంట్రలో ఎమ్మెల్యే పితాని ర్యాలీ

మానవత్వం చాటిన మంత్రి నిమ్మలకు కృతజ్ఞతలు

పాలకొల్లు టౌన్, జూలై 2: పాలకొల్లు 18వ వార్డుకు చెందిన 13నెలలు పాపకు చేసిన సర్జరీ సక్సెస్ అయ్యింది. ఇటీవల పాప అక్షరను తల్లిదండ్రులు ఇరిగేషన్ శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు వద్దకు తీసుకొచ్చి పాప కిడ్నీ సమస్యతో బాధపడుతున్నదని, సర్జరీకి రూ.లక్షా 50వేలు ఖర్చు అవుతుందని ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నదని మంత్రి నిమ్మల దృష్టికి తీసుకొచ్చారు. దీనితో విజయవాడ ఆసుపత్రిలో మంత్రి డాక్టర్లతో మాట్లాడి ఉచితంగా సర్జరీ చేయించారు. ప్రస్తుతం చిన్నారి అక్షర ఆరోగ్యంగా ఉన్నది. మానవత్వం చాటిన మంత్రి నిమ్మల రామానాయుడును మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో తల్లిదండ్రులు పాపను తీసుకొచ్చి కలిశారు. ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

సాగు, తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వండి

వీరవాసరం, (భీమవరం టౌన్) : వీరవాసరం మండలంలో ప్రజలకు తాగునీరు, రైతులకు సాగునీరు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. మంగళవారం జరిగిన వీరవాసరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి పనుల విషయంలో ఎటువంటి రాజకీయాలకు తావు ఉండదని అన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శరవేగంగా జరిగేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈసమావేశంలో జడ్పీటీసీ గుండా జయప్రకాష్‌నాయుడు, ఎంపీపీ వీరవల్లి దుర్గ భవానీ, ఎంపీడీవో టి విజయసారథి, ఎంఆర్‌ఓ జై సుశీల దేవి పాల్గొన్నారు.

పాలకోడేరు పీహెచ్‌సీ తనిఖీ

పాలకోడేరు, జూలై 2: పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అన్ని వసతులు దాతల సహకారంతో అందిస్తానని ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఆవరణతో పాటు అన్ని గదులను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి పైభవనంలో సగంలో నిలిచిపోయిన ఆసుపత్రి గది నిర్మాణాన్ని ఆయన పరిశీలించి భవనాన్ని పూర్తి స్థాయిలో నిర్మించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ రంగం నాయుడు, డాక్టర్ స్వర్ణ నిరంజని, గ్రామసర్పంచ్ ఎంజేటి మరియమ్మ, టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు, కొత్తపల్లి నాగరాజు, మురళీకృష్ణంరాజు, జనసేన నాయకుడు జుత్తిగ నాగరాజు పాల్గొన్నారు.



దారతిప్పలో చెక్‌పోస్టు రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయకర్

• పాలకోడేరులోని జిల్లాపరిషత్ హైస్కూల్‌లో దాతలు సమకూర్చిన 100రకాల మొక్కలను పాఠశాల ఆవరణలో నాటే కార్యక్రమాన్ని గ్రామస్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, జాయింట్ కలెక్టర్ ఆదిత్యప్రవీణ్‌లు మొక్కలు నాటారు.

ఉండి అభివృద్ధికి రూ.లక్ష విరాళం

ఉండి నియోజకవర్గ అభివృద్ధికి పాలకోడేరు మండల పరిషత్ అధ్యక్షుడు భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటి రాజు) ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుకు పాలకోడేరులో మంగళవారం రూ.లక్ష చెక్కును అందించారు. కార్యక్రమంలో సహకార బ్యాంకు మాజీ అధ్యక్షుడు నాగరాజు, బ్యాంకు కార్యదర్శి పెనుమత్స నరసింహరాజు, కొత్తపల్లి అప్పలరాజు పాల్గొన్నారు.


తణుకులో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

ప్రజలకు రుణపడి ఉంటా: పితాని

పెనుమంట్ర, జూలై 2 : అఖండ విజయాన్ని చేకూర్చిన ప్రజలకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. మంగళవారం మాముడూరు, పొలమూరు, వీపీ పాలెం, జుత్తిగ, మల్లిపూడి, ఎస్సైపప్రు, నత్తా రామేశ్వరం, పెనుమంట్ర, గరువు భట్లమగుటూరు, ఆలమూరు, ఓడూరు , నేలమూరు గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయాన్ని చేకూర్చిన ప్రజలకు నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతూ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాస్ రెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు కోయ వెంకట కార్తీక్, బీజేపీ మండల అధ్యక్షుడు కేహెచ్‌వి ప్రసాద్ రెడ్డి, ఆచంట జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్ బాబు పాల్గొన్నారు.

97 శాతం పింఛన్ల పంపిణీ

తణుకు, జూలై 2: ఒక్క రోజులోనే 97 శాతం పింఛన్లు పంపిణీ చేసి కూటమి నాయకులు, కార్యకర్తలు సత్తా చాటారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పంపిణీలో పాల్గొన్న సచివాలయ, ఇతర ఉద్యోగులను అభినందించారు. రాష్ట్ర ఖజానా ఖాళీ అయినా సీఎం చంద్రబాబు నాయుడు మాట నిలబెట్టుకున్నారని కొనియాడారు. తణుకు నియోజకవర్గంలో ఒక్కరోజులోనే 38 వేల పింఛన్లు అందించారన్నారు. నాయకులు కలగర వెంకట కృష్ణ, డాక్టర్ దొమ్మేటి వెంకట సుధాకర్, ఆనాల ఆదినారాయణ, గోపిశెట్టి రామకృష్ణ, పితాని మోహన్, కొమ్మిరెడ్డి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల ఆనందమే ముఖ్యం

తణుకు, జూలై 2: పింఛన్‌దారుల ఆనందమే ముఖ్యమంత్రి చంద్రబాబుకు ముఖ్యమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం క్యాంపు కార్యాలయం వద్ద దివ్యాంగులు సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పింఛన్లు 3 వేల నుంచి 6 వేలకు పెంచి ఆదుకున్న ఆపద్బాంధవుడు చంద్రబాబు అని కొనియాడారు. పలువురు పింఛన్‌దార్లు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని పురేటి లక్ష్మి అనే దివ్యాంగురాలి ఇంటికి ఎమ్మెల్యే ఆరిమిల్లి స్వయంగా వెళ్ళి పింఛన్ అందజేశారు. టీడీపీ నాయకులు మంత్రిరావు వెంకటరత్నం, తాతపూడి మారుతీరావు, నందూరి రాము, గమిని రాము, తాతపూడి నూకరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాయకర్ చెక్ పోస్టు తనిఖీ

మొగల్తూరు, జూలై 2: నరసాపురం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు చెందిన చెక్ పోస్టును మంగళవారం రాత్రి ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ తనిఖీ చేశారు. మండలంలోని నాగిడిపాలెం బ్రిడ్జి సమీపంలో దారతిప్ప వద్ద గల నరసాపురం వ్యవసాయమార్కెట్ యార్డ్ చెక్ పోస్టును పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ ఆదాయ అభివృద్ధికి సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబర్చి పనిచేయాలన్నారు. చెక్ పోస్టులోని రికార్డులు పరిశీలిచారు.

పర్యావరణాన్ని కాపాడాలి


టీబీఆర్ డిఫెన్స్ అకాడమీలో మొక్కలు నాటుతున్న చైర్మన్ భోగేశ్వరరావు

పెంటపాడు, జూలై 2: పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని టీబీఆర్ సంస్థ అధినేత తనుబుద్ది భోగేశ్వరరావు అన్నారు. అలంపురం టీబీఆర్ సైనిక్ పాఠశాలలో మంగళవారం హరిత హారం నిర్వహించారు. టీబీఆర్ డిఫెన్స్ అకాడమీలో విద్యార్థులు, సిబ్బంది మొక్కలు నాటారు. కరస్పాండెంట్ పద్మావతి, డైరక్టర్ రవికిరణ్, డిఫెన్స్ అకాడమీ డైరక్టర్ ఆస్కార్ దాస్, ప్రిన్సిపాల్ కరుణప్రసాద్, హెచ్ఎం కళ్యాణి పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఆకలి సమస్య ఉండదు : వలవల

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 2: రాష్ట్రంలో ఇక ఆకలి సమస్య ఉండదని, త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లు ప్రారంభమవుతాయని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. పట్టణంలోని తాలూకా సెంటర్ సమీపంలో గల అన్న క్యాంటీన్ వద్ద 20వ వార్డు అధ్యక్షుడు పుల్లింగల చిన్న కుటుంబీకుల సహకారంతో మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు.

కామాక్షి అమ్మవారికి పూజలు



పెంటపాడు, జూన్ 2: పెంటపాడు కోనేరు చెరువు సమీపంలో గల కామాక్షి అమ్మవారి ఆలయ వార్షి కోత్సవం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతోంది. మంగళవారం అమ్మవారికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి పూజలు చేయగా ఆలయ కమిటీ సభ్యులు బాబ్జిని సత్కరించారు.

విద్యార్థులు సమాజానికి ఆదర్శంగా నిలవాలి

ఆకివీడు, జూలై 2: డాక్టర్స్ డే సందర్భంగా సోమవారం రాత్రి స్థానిక ఐఎంఏ హాల్‌లో టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన హారిక, దుర్గాభవాని, నాగశ్రీ వైష్ణవి, భావన, సతీష్‌లు ఒక్కొక్కరికి రూ.10వేలు నగదుతో పాటు మెమెంటో ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ కవిత, సెక్రటరి కలిదిండి మహేష్ వర్మ, కోశాధికారి కనుమూరి మాధవీ కళ్యాణి, కిరణ్, ప్రతాప్‌కుమార్, బిలాల్, సుబ్బరాజు, కృష్ణంరాజు పాల్గొన్నారు.

అతిసారపై అవగాహన కల్పించాలి

పాలకోడేరు, జూలై 2: వర్షాకాలంలో తాగునీరు కలుషితం కావడం ద్వారా అతిసార సోకే ప్రమాదం ఉందని వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి అతిసారపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి (డీఎంఅండ్‌హెచ్‌ఓ) డాక్టర్ మహేశ్వరరావు అన్నారు. పాలకోడేరులో మంగళవారం పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రంగంనాయుడు, మరో వైద్యురాలు డాక్టర్ స్వర్ణనిరంజని ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ మహేశ్వరరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌లో 5 సంవత్సరాలలోపు పిల్లలకు అతిసార సోకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ప్రతీ ఒక్కరు కాచిచల్లార్చిన నీటిని తాగటం ద్వారా అతిసార నుంచి విముక్తి పొందవచ్చని అన్నారు.

అత్తిలి: డయేరియా రాకుండా ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, ఆశా వర్కర్స్ ప్రతి బిడ్డకు రెండు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డి మహేశ్వరరావు కోరారు. అత్తిలి పీహెచ్‌సీలో డయేరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, ఎక్కువసార్లు నీళ్ళ విరేచనాలు, వాంతులు అవుతుంటే ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ టాబ్లెట్స్ అందజేయాలని కోరారు.

తాడేపల్లిగూడెం రూరల్: అవగాహన లోపంతో వచ్చే వ్యాధులను దరి చేరనీయమని వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి జి. రూపాదేవి స్పష్టం చేశారు. వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం స్టాప్ డయేరియా పేరుతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. డయేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సీహెచ్‌వో సూర్యకాంతం, హెచ్‌వీ జ్యోతిర్మయి, హెచ్ఎస్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న జనసేన నాయకుడు

పెంటపాడు, జూలై 2: తమ నాయకుడు గెలిస్తే ఆంజనేయస్వామికి 101 కొబ్బరి కాయలు కొడతానంటూ పడమరవిప్పర్రు గ్రామానికి చెందిన జనసేన నాయకుడు చినమిల్లి బాబి మొక్కుకున్నాడు. ఈ మేరకు ఎమ్మెల్యే బొలిశెట్టి సమక్షంలో గ్రామంలోని ఆంజనేయస్వామి కి 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నాడు. అలాగే బొలిశెట్టికి సుమారు 63 వేల ఓట్ల మెజారిటీ రావడంతో ఆంజనేయస్వామిని 63 పూలదండలతో అలంకరించాడు.

'బ్యాంకులో కుంభకోణం లేదు'

ఆకివీడు, జూలై 2: కెనరా బ్యాంకులో కుంభకోణం జరిగిందంటూ బయట పుకార్లు వినబడుతుండడంతో వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర సహాధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య బ్యాంకు మేనేజర్ శర్మను మంగళవారం బ్యాంకులో ప్రశ్నించారు. బ్యాంకు అధికారి, అప్రైజర్ కలిసి కుంభకోణానికి పాల్పడ్డారని తమకు కొందరు ఖాతాదారులు విన్నవించుకున్నారన్నారు. దీనిపై బ్యాంకు మేనేజరు శర్మ మాట్లాడుతూ బ్యాంకులో అటువంటిది ఏమీ జరగలేదని, అప్రైజర్ అప్పుల పాలవ్వడంతో అప్పులు వాళ్లు బ్యాంకుకు వచ్చి గొడవలు పడుతుండడంతో అతనిని ఉద్యోగం నుంచి మానిపించడం జరిగిందన్నారు.

కాపవరంలో పింఛన్ల పంపిణీ


కాపవరంలో సోమవారం రాత్రి పెన్షన్లు అందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ అంగర

పాలకొల్లు, జూలై, 2 : మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ తన స్వగ్రామం కాపవరంలో సోమవారం రాత్రి వృద్ధాప్య పెన్షన్లు లబ్ధిదారుల ఇంటికి వెళ్ళి అందజేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ కోలాటి రాధ, మాజీ ఎంపీటీసీ పాలా విజయకుమారి పాల్గొన్నారు.

మాజీ మంత్రి సుజాత పింఛన్లు పంపిణీ

వీరవాసరం(భీమవరంటౌన్): వీరవాసరం గ్రామంలో మంగళవారం మాజీ మంత్రి పీతల సుజాత పింఛన్లు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గుండా జయప్రకాష్ నాయుడు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపల్లి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ, ప్రతిజ్ఞ


అల్లూరి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

భీమవరం టౌన్, జూలై 2: విప్లవవీరుడు అల్లూరి సీతారామ రాజు జయంతి ఉత్సవాల్లో భాగంగా శ్రీవిజ్ఞానవేదిక, అల్లూరి సీతారామరాజు యువజన సంఘం సమాఖ్య ఆధ్వర్యంలో చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థులతో ర్యాలీ, దేశ భక్తి ప్రతిజ్ఞ, పోటీలను నిర్వహించారు. యూత్ హాస్టల్స్ అధ్యక్షుడు చిలుకూరి నరసింహరాజు, స్కూల్ ప్రిన్సిపాల్ నడింపల్లి కృష్ణంరాజు, సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే సతీమణి సత్యవాణి

భీమవరం టౌన్, జూలై 2 : సంపూర్ణ విద్యతోనే సమాజ ప్రగతి అని ఎమ్మె ల్యే పులపర్తి రామాంజనేయులు సతీమణి సత్య వాణి అన్నారు. ఎమ్మెల్యే అంజిబాబు నివాసం వద్ద ఇన్నర్ వీల్ క్లబ్, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో కేజీఆర్ఎల్ జూనియర్ కళాశాల విద్యార్థులకు పుస్తకాలను అందించారు. ఆమె మాట్లాడుతూ దాతలందిస్తున్న సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు గంధం రమాదేవి, నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి, నరహరిశెట్టి కృష్ణ పాల్గొన్నారు

మొగల్తూరు: ముత్యాలపల్లి పంచాయతీ చింతరేవు గ్రామంలో అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు టీడీపీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు నోట్ పుస్తకాలు, విద్యాసామగ్రి అందించారు. కార్యక్రమంలో ఆ గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తక్కువ పాటకు చేపల పట్టుబడి

ఆకివీడు, జూలై 2: భుజబలరాయుడు మంచినీటి చెరువులో ఒకరోజు చేపలు పట్టుకోవడానికి రూ. 36వేలకు పాడుకున్నారు. ఇదే చెరువు గత ఏడాది రూ.65వేలకు వెళ్ళగా ఈ ఏడాది అంతకంటే ఎక్కువగా పాటలు నిర్వహించాల్సి ఉండగా తక్కువకు వేలం పాట నిర్వహించడంతో ప్రజల నుంచి విస్మయం వ్యక్తమవుతున్నది. అయితే ఎక్కువ వేలంపాటకు ఎవరూ ముందుకు రాకపోవడం వల్ల ఇలా జరిగిందని కమిషనర్ వివరణ ఇచ్చారు.

డ్రెయిన్‌లలో చెత్త తొలగింపు పనులు


పనులను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

ఉండి, జూలై 2: సార్వా సాగుకు రైతులకు ఎటువంటి సాగునీటి ఆటంకాలు లేకుండా బొండాడ డ్రెయిన్‌లోని మట్టి పూడిక, చెత్త తొలగింపు పనులకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు ఆదేశాలతో ఈపనులను చేపట్టినట్లు మండల టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు కరిమెరక నాగరాజు, కిన్నెర వెంకన్న, ఉపాధ్యక్షుడు పేరిచర్ల బాలరాజు తెలిపారు. ఉండి అక్విడెక్టు నుంచి ప్రారంభించి వాండ్రం రైల్వే ట్రాక్ వరకు పూర్తిచేయడం జరుగుతుందని తెలిపారు.

కుంచనపల్లిలో స్వచ్ఛభారత్

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 2: తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లిలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మంచినీటి చెరువు చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు, చెత్తను శుభ్రం చేశారు. ఈ స్వచ్ఛభారత్ ప్రతి వారం కొనసాగిస్తామని, ప్రజలు కూడా గ్రామాభివృద్ధికి సహకరించాలని కూటమి నాయకులు కోరారు.

రోటరీ క్లబ్ కార్యవర్గ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవం



పాలకొల్లు అర్బన్, జూలై 2 : పాలకొల్లు రోటరీ క్లబ్ 2024-25 ఏడాదికి సంబంధించి నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం ఏకగ్రీవంగా జరిగింది. డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్, పాస్ట్ ప్రెసిడెంట్ పెనుమాక రామమోహన్‌రావు అధ్యక్షతన ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా రావాడ సతీష్, కార్యదర్శిగా జవ్వాజి కళ్యాణ్, కోశాధికారిగా పోతా బత్తుల సత్యనారాయణలను ఎన్నుకున్నారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

పాలకొల్లు అర్బన్, జూలై 2 : స్థానిక లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం లయన్స్ క్లబ్ హాల్లో సోమవారం రాత్రి జరిగింది. ప్రెసిడెంట్‌గా డాక్టర్ కొయ్య జయభారత రెడ్డి, కార్యదర్శిగా అందే భాను ప్రకాష్, కోశాధికారిగా టివిఆర్ సురేష్‌లచేత డిస్ట్రిక్ట్ ఫాస్ట్ గవర్నర్ పి విజయ భాస్కరరెడ్డి (ఏలూరు) ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా వృద్ధులకు పెన్షన్లు, విద్యార్థులకు సైకిళ్ళను అందజేశారు అనంతరం నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు.

వరి పరిశోధనా స్థానం సందర్శన

పెనుమంట్ర, జూలై 2 : ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ పాలడుగు సత్యనారాయణ మార్టేరు వరి పరిశోధన స్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పరిశోధన శాస్త్రవేత్తలు సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. గతంలో పాలడుగు సత్యనారాయణ రైస్ విభాగం ప్రధాన శాస్త్రవేత్తగా మార్టేరు వరి పరిశోధన స్థానంలో పనిచేసి శ్రీకాకుళం పరిశోధన స్థానానికి బదిలీపై వెళ్లారు. ఇటీవల ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులుగా నియమకమై తొలిసారి మార్టేరు పరిశోధన స్థానాన్ని సందర్శించడంతో శాస్త్రవేత్తలు సిబ్బంది ఆయనకు పుష్ప గుచ్ఛాలి ఇచ్చి స్వాగతం పలికారు. జిల్లాకు విచ్చేసిన సందర్భంగా జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి పరిశోధనలు వివరించారు.

ఆర్థిక సాయం

తణుకు, జూలై 2: జై లలితాంబ కార్ యూనియన్ సభ్యుడు వేటుకూరి కేశవ అనారోగ్యంతో బాధపడుతుండటంతో మంగళవారం యూనియన్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చేతులు మీదుగా ఆర్థిక సాయం అందజేసారు. తణుకు టౌన్ వైడ్ మోటారు ట్యాక్సీ, అంబులెన్సు ఓనర్స్, వర్కర్సు ద్వారా సేకరించిన రూ. 60 వేలతో పాటు ఆరిమిల్లి సొంతంగా 5 వేలు కలిపి రూ. 65 వేలను కేశవ కుటుంబీకులకు అందజేశారు.

రేపు ట్రస్టు ఆసుపత్రికి ప్రత్యేక వైద్య నిపుణులు

పెంటపాడు, జూలై 2: అలంపురం ట్రస్టు ఆసుపత్రికి ఈ నెల 4న రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్య నిపుణులు వస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. ఎముకలు, కీళ్ళు, జనరల్ సర్జన్, చర్మవ్యాధులు, ఊపిరితిత్తులు, చెవి, ముక్కు, గొంతు సంబంధ వైద్య నిపుణులు ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తారన్నారు. అవసరమైన వారికి అన్ని రకాల రక్తపరిక్షలతో పాటు ఈసీజీ, అల్ట్రాసౌండ్ పరీక్షలు కూడా ఉచితంగా చేస్తారని, ప్రజలు వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు విద్యా సంస్థల బంద్

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 2: దేశవ్యాప్తంగా ఈ నెల 4న విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రూపా శంకర్ కోరారు. తాడేపల్లిగూడెంలోని కళాశాలలు, స్కూల్స్‌కు ఐక్య విద్యార్థి సంఘాల పిలుపుమేరకు మంగళవారం పీడీఎస్‌యూ బృందం నోటీసులు జారీచేసింది. జిల్లా నాయకులు శ్రీను, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు నాగేంద్ర, కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై గుంతల పూడ్చివేత



తాడేపల్లిగూడెం రూరల్, జూలై 2: ఆరుగొలను జడ్పీ ఉన్నత పాఠశాల రోడ్డులో గోతులను ఉప సర్పంచ్ అడపా అప్పలరాజు ఆధ్వర్యంలో మంగళవారం పూడ్చారు. కొంత కాలంగా ఆ దారి గోతులు పడి విద్యార్థులు వెళ్లేందుకే ఇబ్బందిగా ఉండటంతో నాయకుల దృష్టికి ఆ సమస్య తీసుకెళ్లారు. దీంతో ఎక్స్‌కవేటర్ యజమానులతో మాట్లాడి రహదారిలో గ్రావెల్ పోసి గోతుల పూడిక చేపట్టారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

హిందువులకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 2: ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హిందువులకు క్షమాపణలు చెప్పాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నరిసే సోమేశ్వరరావు అధ్యక్షతన జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్లమెంటేరియన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తూ జై పాలస్తీనా అని నినాదాలు చేసిన అక్బరుద్దీన్ ఒవైసీని విమర్శించకుండా హిందుత్వాన్ని కాపాడుకుంటూ వస్తున్న బీజేపీని విమర్శించడం రాహుల్ గాంధీకి తగదన్నారు. పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్ గాంధీ ప్రసంగాన్ని, ప్రమాణం చేసిన ఎంఐఎం ఎంపీ ఒవైసీ వ్యాఖ్యలు రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.